క్లుప్తంగా

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

రాయికల్: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు వండించే భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట డెప్యూటీ సీఈవో నరేశ్, ఎంపీడీవో చిరంజీవి తదితరులున్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోరుట్ల: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. మెట్రోపాలిటన్ సిటీ క్రిమినల్ కోర్టులో, నాగర్‌కర్నూల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులపై జరిగిన దాడిని నిరసిస్తూ విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడటం సరికాదని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ చట్టం అమలులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పల్లి సురేశ్, వైస్ ప్రెసిడెంట్ కస్తూరి రమేశ్, న్యాయవాదులు శ్రీనివస్ రావు, సదాశివ్,తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి డీఎల్‌పీవోగా సుదర్శన్



డీఎల్‌పీవోను సన్మానిస్తున్న అధికారులు,సిబ్బంది

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి డీఎల్‌పీవోగా సుదర్శన్ నియామకమయ్యారు .ఈ మేరకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆయన కార్యాలయ అధికారులు,సిబ్బందితో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, హౌసింగ్ ఏఈ శరత్, ఈ–పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో ధ్యానోత్సవం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధ్యానోత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు మంచాల కృష్ణ మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో మానసిక ప్రశాంతత కోసం ప్రతీ ఒక్కరు ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పండగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో అతిపెద్ద పండగ అయిన సద్దుల బతుకమ్మ, దసరా పూట కార్మికులు, వారి కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొందని, ఈనెల 21లోపు వేతనాలు అందేలా ప్రభుత్వం చూడాలని కోరారు. జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, నాయకులు జంగిలి ఎల్లయ్య, రాజయ్య, సాతల్ల రాజేందర్, ఆంజనేయులు, తిరుపతి పాల్గొన్నారు.

మంజూరు 455, ప్రారంభం174

- నత్త నడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ఆర్థిక సమస్యలతో వెనకడుగు
- పనులకు అనుగుణంగా బిల్లుల చెల్లింపులు



రేచపల్లిలో పిల్లర్లతో ఇంటి పనులు



నాయికపుగూడెంలో లెంటల్ లెవల్‌కు పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

సారంగాపూర్: పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో గ్రామాల్లో ఇళ్ల నిర్మాణంతో పండగ వాతావరణం కనిపిస్తోంది. పదేళ్లుగా నిర్మాణం లేకపోవడం, పేద, మధ్యతరగతి కుటుంబాలు సొంతంగా ఇళ్లు కట్టుకోవడంతో ఆర్థికంగా చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించి ఇళ్లు నిర్మాణం చేసుకునేవారికి రూ. 5 లక్షలు అందిస్తామని పేర్కొనడం, దానికి అనుగుణంగా ఇళ్ల ప్రగతికి అనుగుణంగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమవుతుండడంతో నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అయినప్పటికీ కొన్ని కుటుంబాలు ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక పరమైన ఇబ్బందులతో పనులు ప్రారంభించలేదు.

మండలానికి మంజూరైన ఇళ్లు 455

మండలంలోని 18 గ్రామాలకు ప్రభుత్వం 455 ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు 274 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి భూమిపూజ చేశారు. ఇందులో 56 ఇళ్లు బేస్‌మెంట్, పిల్లర్ల వరకు పూర్తి కాగా, మరో 3 ఇళ్లు గోడల వరకు లెంటల్ స్థాయిలో ఉన్నాయి. 3 ఇళ్లు స్లాబ్ పూర్తయ్యాయి.

బిల్లుల చెల్లింపులు..

నిర్మాణ ప్రగతికి అనుగుణంగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు స్లాబ్ వరకు పూర్తయిన 3 కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున బిల్లులు జమకాగా, మరో రెండు కుటుంబాలకు ఈ వారంలో రూ. 2 లక్షల చొప్పున బిల్లులు జమ కానున్నాయి. బేస్‌మెంట్, పిల్లర్లు పూర్తి చేసిన 4 కుటుంబాలకు రూ.1 లక్షల చొప్పున బిల్లులు ఖాతాలో జమ అయ్యాయి. ఈ వారం రోజుల్లో మరో 40 కుటుంబాలకు బేస్‌మెంట్, పిల్లర్ల వరకు పూర్తి అయిన లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 1 లక్ష చొప్పున రూ. 40 లక్షలు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఆర్థికసాయం అందించినా ముందుకు రాని లబ్ధిదారులు

స్వశక్తి సంఘాల నుంచి రూ. 1 లక్ష అందిస్తామని మీరు ఇంటి నిర్మాణం ప్రారంభించగానే మీకు ఈ డబ్బులు అందించడంతో ఇంటి నిర్మాణ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నా, చాలా మంది నిర్మాణానికి నిరాసక్తత కనబర్చడం లేదు. కేవలం నిర్మాణ వ్యయం రూ. 5 లక్షలు దాటిపోతుందన్న భావనతో ఉన్నట్లు తెలుస్తుంది..

ప్రారంభం కాని నిర్మాణాలు 181 ఇళ్లు

181 మంది వివిధ కారణాలతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు... దీనికి ఆర్థిక పరమైన కారణాలు ప్రధానమని తెలుస్తుంది..

- మండలంలోని భీంరెడ్డిగూడెం గిరిజన గ్రామంలో మంజూరైన మూడు ఇళ్లు.. ఈ మూడు ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. అధికారులు ఎంత కౌన్సెలింగ్ ఇచ్చినా, వారు ఇంటి నిర్మాణం చేస్తే అదనపు బాకీలు అవుతాయని నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.
- ఎక్కువ మంది లబ్ధిదారులు బేస్‌మెంట్, పిల్లర్లు పూర్తి అయ్యే వరకు మాకు కొంత చేతుల్లో డబ్బు పెట్టుబడిగా ఉండాలని, అయినా అది కూడ లేదని ఫలితంగా ఇళ్లు నిర్మాణం చేసుకోవడంపై నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.
- ఇసుక, సిమెంట్, ఇంటి నిర్మాణంలో వాడే కంకర, సలాక వంటి వాటి ధరలు పెరిగాయని, నిర్మాణం చేసే మేస్త్రీలు ధరలు గతంతో పోలిస్తే బాగా పెరిగాయని దీనితో వారు ముందుగానే లెక్కలు వేసుకుని నిర్మాణం చేసుకోవడానికి ముందుకు రావడం లేదు.
- కొంత మంది ఇప్పుడు మంచిరోజులు కావని, దసరా నుంచి ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు.

ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలి



జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇసుక స్టాక్ పాయింట్ ప్రారంభించడంతో ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు కొండంత బలం వచ్చింది. ఇసుక పాయింట్ నుంచి ఇళ్లు నిర్మాణం చేసుకునే పేదలకు ఉచితంగా ఇసుక అందిస్తే వారి సాయంగా ఉంటుంది. ఇసుక సరఫరాపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి.

– బీర మహేశ్,రేచపల్లి

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం



ఇళ్లు నిర్మాణం చేసుకోవాలని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్ చేస్తున్నాం. సెర్ప్ ద్వారా రూ. 1 లక్ష ఇస్తామని చెబుతున్నాం. ఈ వారం రోజుల్లో 50 ఇళ్ల పనులు ప్రారంభించే అవకాశం ఉంది. వందశాతం ఇళ్లు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నాం.

– చౌడారపు గంగాధర్, ఎంపీడీవో, సారంగాపూర్

ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం



కీటకాలు విడుదల చేస్తున్న అధికారులు

మల్యాల: రైతులు అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పాం సాగు చేపట్టాలని, మూడేళ్ల అనంతరం ప్రతినెలా ఆదాయం వస్తుందని జిల్లా ఉద్యానవన అధికారి శ్యాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయిల్‌పాం తోటల్లో పరాగ సంపర్కం కోసం కీటకాలను విడుదల చేశారు. జిల్లాలో మూడేళ్ల ఆయిల్‌పాం తోటల్లో దిగుబడి కోసం ఎలైడోబియస్ కామెరూనికస్ అనే కీటకాలను విడుదల చేశామన్నారు. లోహియా జీఎం మురళి, మండల విస్తరణాధికారి జ్యోతి, ఉద్యాన విస్తరణాధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటలో కీటకాల విడుదల

కొడిమ్యాల: మండలంలోని శ్రీరాముల పల్లిలో ఉద్యాన శాఖ, లోహియా ఆయిల్ పామ్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయిల్ పామ్ తోటలో పరాగ సంపర్కం కోసం ఉపయోగపడే కీటకాలను విడుదల చేశారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ చెట్లకు పరాగసంపర్కం అవసరమని, అధిక దిగుబడి కోసం ఎల్ఐడోబిఎస్ కామేరునికస్ అన్న కీటకాలను విడుదల చేయాల్సి ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి అనిల్, లోహియా జనరల్ మేనేజర్ మురళి, రైతులు పాల్గొన్నారు.

ధర్మపురి పుణ్యక్షేత్రానికి పూర్వ వైభవం

ధర్మపురి: రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవతో ధర్మపురి పుణ్యక్షేత్రానికి పూర్వ వైభవం లభించనుందని ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ అన్నారు. స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కార్యాలయంలో శుక్రవారం ఈవో శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ధర్మపురి పుణ్యక్షేత్రాన్ని రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భారీగా నిధులు మంజూరు చేసి కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేయనున్నారని అన్నారు. సుమారు రూ.50 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. సమావేశంలో ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసచారి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

బొమ్మెనలో కూలిన ఇల్లు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామంలో దొంగిసారపు భూమయ్య అనే వ్యక్తికి చెందిన ఇల్లు వర్షం తాకిడికి కూలినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. వర్షం కురియడంతో ఇంటి పైకప్పు తడిసి కూలినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జగిత్యాల రూరల్: మల్లాపూర్‌:సారంగాపూర్: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహర మాసోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలకు ఆమె పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, రాధ, వసంత, గంగభవాని, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సారంగాపూర్: ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, ప్రతి ఒక్కరు పచ్చదనం పెంచడానికి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఈజీఎస్ టిఏ శివ, అధ్యాపకులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బన్న, మూర్తి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, మహిళ సమైక్య అధ్యక్షురాలు సుమ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులు మొక్కలు నాటారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి గుంతలను తవ్వి మొక్కలు నాటారు.

విద్యార్థులు మొక్కలు నాటాలి

ఇబ్రహీంపట్నం : ప్రతీ ఒక్కరు జన్మనిచ్చిన తల్లి పేరున ఒక మొక్క నాటాలని ఎంపీడీవో ఎం.డీ సలీం అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్, వర్షకొండ గ్రామాల్లో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శులుచఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్:ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలని జగిత్యాల ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తమ ఇంటి సమీప ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ రాజమల్లయ్య, హెచ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం నాయకుల ముందస్తు అరెస్టు

కోరుట్ల: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో నిరసనకు వెళ్తారనే సమాచారంతో పోలీసులు కోరుట్లలో ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేదని, సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతమవుతుందని పేర్కొన్నారు.

శరన్నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు

ధర్మపురి: దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

మేడిపల్లి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టీపీటీఎఫ్ సభ్యత నమోదులో భాగంగా శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కొక్కుల రామచంద్రం మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న డీఏ లను విడుదల చేస్తూ, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యా వలంటీర్లను నియమించి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాయికల్: పట్టణంలోని వీరాపూర్ క్రాసింగ్ వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని శుక్రవారం పట్టుకున్నట్లు సిసిఐ సిఐ శ్రీనివాస్ తెలిపారు. వీరి వద్ద నుంచి 12080 రుపాయలు స్వాధీనం చేసుకుని వారిని రాయికల్ ఎస్సై కి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై రవీందర్ తదితరులు పాల్గొన్నారు

నేడు మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం ×స్వస్త్ నారి– స్వశక్త్ పరివార్ అభియాన్‌ె కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సింధూజ తెలిపారు. దీనిలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. మహిళల, పిల్లలపై వైద్యులు ప్రత్యేకంగా వైద్యపరీక్షలు చేస్తారని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్లలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. కల్లెడ పరిధిలోని కల్లెడ, తక్కళ్లపల్లి, సోమన్‌పల్లి, సంగంపల్లి, హబ్సీపూర్, గుత్రాజ్‌పల్లి, అనంతారం, లక్ష్మీపూర్ పరిధిలో లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



కథలాపూర్: మండలంలోని అంబారిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పీహెచ్‌సీ పాములకు, విష పురుగులకు నిలయంగా మారిందని గ్రామస్తులు పేర్కొన్నారు. పిచ్చిమొక్కలు ప్రధాన గేట్ పక్కనే ఉండటంతో వైద్యం కోసం వచ్చే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చొరవ చూపి ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి చదును చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఎంపీవో కథలాపూర్, సెల్ నంబర్: 9640807073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అల్ఫోర్స్‌లో బతుకమ్మ వైభవ్ ఉత్సవాలు



విద్యార్థులతో ఎమ్మెల్యే సత్యం, నరేందర్ రెడ్డి

మల్యాల: మండలంలోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో శనివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మలు పేర్చి, బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ వేడుకలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆల్ఫోర్స్ సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల జోష్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుతూ ముందుకెళ్లాలని, జీవితంలో స్థిరపడాలన్నారు. విద్యార్థులు డిగ్రీలో నిర్లక్ష్యం చేయవద్దని, ఇది ఎంతో మంచి అవకాశమని, ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో శుక్రవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి,బతుకమ్మలు పేర్చి, ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ ఆడుతూ, సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా, నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

జగిత్యాల: హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే బతుకమ్మ, దసరా, నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పలు చోట్ల రోడ్లు ధ్వంసమై గుంతలు పడ్డాయని, దుర్గామాతను ప్రతిష్ఠించే ప్రదేశాలు కావడంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రతి చోట లైటింగ్ ఏర్పాటు చేయాలని, అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆముదరాజు, కొక్కు గంగాధర్ పాల్గొన్నారు.

సమాజ సేవే నిజమైన విద్య

జగిత్యాల: విద్యార్థులకు సమాజ సేవే నిజమైన విద్య అని ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ముందస్తు జాతీయ సేవ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా ఉండటం గర్వకారణమని, ప్రతి ఒక్కరు దేశభక్తితో పాటు, సమాజ సేవ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, కె.శ్రీనివాస్, డాక్టర్ సాయి, మధుకర్, గోవర్ధన్, మహేశ్, గట్టయ్య, సుప్రియ, కవిత, స్వరూప పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల స్వచ్ఛతా ర్యాలీ

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ గ్రామ శివారులో గల కేజీబీవీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం గ్రామంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలనిప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్, గ్రామ కార్యదర్శి సరిత, ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

మెట్‌పల్లి రూరల్: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మెట్‌పల్లి ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి అన్నారు.మెట్‌పల్లి మండలం వెల్లుల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం అధికారులు,టీచర్లు,విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణ,టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.

మహిళలందరికీ బతుకమ్మ చీరలను ఇవ్వాలి

కథలాపూర్: 18 ఏళ్ల పైబడిన మహిళలందరికి ప్రభుత్వం బతుకమ్మ చీరెలను ఇవ్వాలని కథలాపూర్ మాజీ ఎంపీపీ నాగం అమృత డిమాండ్ చేశారు. శుక్రవారం కథలాపూర్‌లో మాట్లాడుతూ.... బతుకమ్మ చీరెలను మహిళ సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారికి ఇస్తామనే నిబంధన సరి కాదన్నారు. ప్రభుత్వ తన నిర్ణయాన్ని పునరాలోచించుకుని అందరికీ చీరలు అందించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



కోరుట్ల: పట్టణంలోని కేరళ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సెలీనా బారి శుక్రవారం తెలిపారు. ు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ధర్మపురి: జిల్లా కేంద్రంలో ఈనెల 14న జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. మండలంలోని మగ్గిడి (గొల్లపెల్లి) గురుకుల పాఠశాలకు చెందిన అనుదీప్, రామ్‌తేజ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ గోనె రమేశ్, పీడీ, పీఈటీలో సంతోష్, కల్పన అభినందించారు.

పెగడపల్లి:మండలంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 16 విద్యార్థినులు వివిధ క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.